క్లుప్తంగా

ఘనంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మహంకాళి ఆలయ అష్టమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు విఠాల రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖర్ శర్మ, రమేష్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మంగళ హారతులతో సామూహిక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్ముల స్వామి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'బీర్ల'ను కలిసిన కురుమ సంఘం నాయకులు



ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను సన్మానిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను సోమవారం చేర్యాల కురుమ సంఘం నాయకులు ఆలేరులో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పాలక మండలిలో కురుమ సంఘానికి పెద్దపీట వేయాలని కోరగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజయ్య, అశోక్, బీరయ్య, శ్రీకాంత్, భూమయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగుల వేయాలని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములై ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఆర్గనైజర్లుగా వ్యవహరించిన ప్రశాంత్, కరుణాకర్, నరేష్, రమేష్‌లను అభినందించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గజ్వేల్: అమెరికా తెలుగు సంఘం అధ్వర్యంలో ఈనెల 27వ తేదీన గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో అన్ని రకాల రోగాలకు సంబంధించిన పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

'బక్కి'పై అసత్య ఆరోపణలు తగవు

దౌల్తాబాద్(దుబ్బాక): దళిత నాయకుడు బక్కి వెంకటయ్యపై దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు అసత్య ఆరోపణలు చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండోరా శివరాజ్ మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దుబ్బాక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రచారం చేశాడని రఘునందన్‌రావు గవర్నను కలిసి పదవి నుంచి తప్పించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం సరికాదన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందులకు చెందిన బీజేపీ నాయకుడు పద్మారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేశారు. సోమవారం గుడికందులలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. దుబ్బాక అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వామి, నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల పాస్టర్లు భక్తులకు దైవ సందేశం ఇచ్చారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై కేక్ కట్ చేశారు.



గజ్వేల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి



కొమురవెల్లి చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



హుస్నాబాద్‌లో..



దుబ్బాకలో..



మిరుదొడ్డి(దుబ్బాక): క్రీస్తు బోధనలు వినిపిస్తున్న పాస్టర్



బెజ్జంకిలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): రామునిపట్లలో..

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



దుబ్బాక: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్/దుబ్బాక: మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు మరువలేనివని గజ్వేల్ బీజేపీ నేతలు కొనియాడారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, సందీప్, నాగు తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక పట్టణంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్‌గౌడ్ మాట్లాడుతూ.. యువత వాజ్‌పేయి అడుగుజాడల్లో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా కుగ్రామాలకు రోడ్లు వేసిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్ కుమార్, మనోజ్, రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షకు మూలం మనుధర్మమే

హుస్నాబాద్/సిద్దిపేటకమాన్: భిన్న సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన భారతదేశంలో కుల వివక్ష, సామాజిక అసమానతలకు మనుధర్మ శాస్త్రమే మూల కారణమని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మనుస్మృతి దహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ.. మనువు చెప్పిన సూత్రాలన్ని పేద ప్రజలను, మహిళలను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయన్నారు. అనంతరం మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో ముక్కెర సంపత్ కుమార్, బంక చందు, వెన్న రాజు, శంకర్, అయిలేష్ యాదవ్, సరోజన, రజిత, కమల,బాలయ్య, రాజు నాయక్, వినోద్‌కుమార్, సంజీవ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అలాగే



హుస్నాబాద్: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలోని పూలే విగ్రహం ఎదుట మనుధర్మశాస్త్ర ప్రతులను సోమవారం నాయకులు దహనం చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక అణచివేతలకు మూల కారణమైన మనుధర్మశాస్త్ర ప్రతులను ప్రతి ఏడాది డిసెంబర్ 25న దేశావ్యాప్తంగా దహనం చేస్తున్నట్లు తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఆర్ట్ ఆఫ్ లైఫ్ స్కిల్స్‌కు సంబంధించిన మిషన్ కమ్యూనికేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. తాను నేర్చుకున్నది పది మందికి ఉపయోగపడాలనే తపనతో ముందుకు వచ్చిన కోణం శ్రీకాంత్ అభినందనీయుడని కొనియాడారు. మిషన్ కమ్యూనికేషన్ స్కిల్స్ సంస్థ పేద, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే శిక్షణకు తనవంతుగా సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ స్ఫూర్తితో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు 365 రోజుల పాటు 365 రకాల అంశాలపై నైపుణ్యం పెంపొందే విధంగా సిలబస్ రూపకల్పన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పాల సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదిక.. మందుబాబులకు అడ్డా

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులకు శిక్షణ ఇచ్చేందుకు లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన రైతు వేదికలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మండలంలోని అంతక్కపేట, జనగామ, అక్కన్నపేట, మల్లంపల్లి, రామవరం, పోతారం(జే) గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించారు. అయితే రామవరంలోని రైతు వేదిక గ్రామ శివారులో నిర్మించారు. దీంతో రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో రైతు వేదిక ఆవరణలో మందు సీసాలు, గ్లాసులు, తిను బండారాలు దర్శనమిస్తున్నాయి. అలాగే అధికారుల పర్యవేక్షణ లోపంతో మందుబాబులకు వేదికగా మారిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అదేవిధంగా రాత్రి సమయంలో పోలీసులు గ్రామాల్లో గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.



రామవరం రైతు వేదిక



ఆవరణలో మద్యం సీసాలు

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం



తొగుట: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక)/దౌల్తాబాద్: సబ్బండవర్గాల సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేశారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకట్రావుపేట, లింగాపూర్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతాల మధ్య చిచ్చు పెట్టి కొందరు లబ్ది పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అన్నిమతాలు, కులాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ మత సామరస్యాన్ని కాపాడుతూ, దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పాస్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, సర్పంచ్ పాత్కుల లీలాదేవి వెంకటేశం, నాయకులు చంద్రారెడ్డి, కనకయ్య, లక్ష్మణ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రాజేశం, పెంటోజీ, అరుణ్‌కుమార్, బాలయ్య, స్వామి గౌడ్, వెంకట్‌రెడ్డి, రాజేశం, భాస్కర్ గౌడ్, సుభాష్‌గౌడ్, అశోక్, రమేష్ గౌడ్, జహంగీర్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. అలాగే దౌల్తాబాద్ మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ రహీమొద్దీన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు యాదగిరి, దార సత్యనారాయణ, చిత్తారి గౌడ్, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీలపై ప్రశ్నించండి'

నారాయణఖేడ్: ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై అధికారులను ప్రజలు ప్రశ్నించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కానీ.. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల ఉచిత వైద్యం మాత్రమే అమలు చేస్తూ శ్వేతపత్రం విడుదల చేసిందన్నారు. మిగిలిన హామీలను ఎగ్గొట్టడానికి ప్రభుత్వం యత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

నాడు తండ్రి.. నేడు తల్లి మృతి

అనాథలైన ముగ్గురు చిన్నారులు

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో మహిళా వీఆర్ఏ మృతి చెందడంతో ఆమె ముగ్గురు పిల్లలు అనాథలుగా మారిన సంఘటన మండల పరిధిలోని కొల్గూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నీరుడి భాస్కర్- కవిత (32) దంపతులకు కూతుర్లు ఐదేళ్ల కావ్యశ్రీ, మూడేళ్ల శ్రీవాణితో పాటు ఏడాదిన్నర కొడుకు రిషిత్‌కుమార్ ఉన్నారు. వీరు గ్రామంలోనే చిన్నపాటి ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ రెండేళ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడి బాధ్యత (వీఆర్ఏ)ను భార్య కవిత చేపట్టింది. గత ప్రభుత్వం వీఆర్ఏల వ్యవస్థను తొలగించి, ఇతర శాఖల్లో కేటాయించగా.. ఇరిగేషన్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగ భద్రత లేకుండా పోవడం, ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించే స్తోమత లేక అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ మల్లం రాజు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనాథలుగా మారిన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని కోరారు. కాగా మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు డిమాండ్ చేశారు.



తల్లి మృతితో అనాథలుగా మారిన చిన్నారులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

కొనసాగుతున్న మల్లికార్జున స్వామి జాతర

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సర్పంచ్ యాదయ్య ఆధ్వర్యంలో కొబ్బరికాయ కుస్తీని మొదలుకొని వెండికడియం కుస్తీ వరకు కుస్తీపోటీలు హోరాహోరీగా జరిగాయి. విజేతగా కర్ణాటక రాష్ట్రంలోని లాతూర్‌కు చెందిన అభిజిత్ నిలిచారు. దీంతో ఆయనకు సర్పంచ్ 5 తులాల వెండి కడియాన్ని బహూకరించారు. అనంతరం మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కుస్తీ పోటీల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. వచ్చిన భక్తులకు గంగి రాజేందర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జ్యోతి బన్సిలాల్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుస్తీ పడుతున్న మల్లయోధులు

సంక్షిప్త వార్తలు

◆ 'పొన్నం' ఆధ్వర్యంలో అభివృద్ధి

కోహెడరూరల్(హుస్నాబాద్): వెనుకబడిన హుస్నాబాద్ ప్రాంతం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని వరికోల్ ఎంపీటీసీ గోవింద్ నిర్మల జయరాజ్ అన్నారు. సోమవారం గ్రామంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. హుస్నాబాద్ ప్రాంత విద్యార్థులకు హైదరాబాద్‌లో సచివాలయ సందర్శన చేయించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంపత్‌రెడ్డి, రమేష్, వార్డు సభ్యుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ స్నేహితురాలికి చేయూత

గజ్వేల్‌రూరల్: కష్టాల్లో ఉన్న స్నేహితురాలికి తోటి మిత్రులు చేయూతనందించి మనోధైర్యం కల్పించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ (పల్లెపహాడ్)కి చెందిన కీసరి రజిత కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకున్న (2010-11) బ్యాచ్ పదో తరగతి స్నేహితులు అండగా నిలిచారు. సోమవారం రూ. 17 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొమ్ము నరేష్‌యాదవ్, బోనకొండ రాజు, శేఖర్‌యాదవ్, ప్రసాద్, భిక్షపతి, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన ఎన్నిక



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండల పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శులుగా సిద్ధి వెంకటేష్, చంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పూర్వ అధ్యక్షుడు సిద్ది వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కనకారెడ్డి సమన్వయంతో జరిగిన ఎన్నికల్లో నీలం శ్రీను ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. ఈ మేరకు పీఆర్టీయూ జిల్లా నాయకులు శశిధర్‌శర్మ, ఇంద్రసేనారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

◆ ఘనంగా పెన్షనర్స్ డే



చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం చేర్యాల మండల శాఖ అధ్వర్యంలో అఖిల భారత పెన్షనర్స్‌డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డీటీఓ బాల్‌రాజు హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ పదవీ విరమణ అనంతరం సాఫీగా సాగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ దుప్పట్లు పంపిణీ

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రంలోని ఆనంద నిలయంలో అనాథ పిల్లలకు ఆదివారం కొండపాకకు చెందిన బైరి విజయ ప్రతాప్‌రెడ్డి దంపతులు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ 30 నుంచి మల్లన్న జాతర

నర్సాపూర్: పట్టణంలో వెలిసిన కేతకి భ్రమరాంబ సమేత శ్రీమరకత మల్లికార్జునస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి ప్రారంభం అవుతాయని పట్టణ యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను సోమవారం సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఇందులో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో రావాలని వారు కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మల్లేశ్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, నవీన్‌యాదవ్, పెద్ద మల్లేశ్‌యదవ్, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాళ్లకల్‌లో దత్త జయంతి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం మార్గశిర పౌర్ణమి కావడంతో దత్త జయంతి వేడుకలను దత్తగిరి ఆశ్రమ నిర్వాహకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు దేవాలయం వద్ద పారాయణం, హోమం పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దత్తత్రేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్, సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బద్దారం గ్రామంలో దుర్గామాత ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను సోమవారం ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా విగ్రహ ప్రతిష్ఠించారు.